సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 29 । జూలై । 2023



76 వినతుల స్వీకరణ

పాడేరు ఐటీడీఏలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 76 వినతులను స్వీకరించారు. IIలో



అభినందనల వెల్లువ IIలో

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ డీవీజీ శంకరరావును పలువురు అభినందించారు.



నాట్లు వేసిన ఎమ్మెల్యే..

రంపచోడవరం : గడపగడపకు కార్యక్రమానికి వెళ్తూ ఎమ్మెల్యే ధనలక్ష్మి లొద్దిపాలెంలో నాట్లు వేస్తూ కూలీలను ఉత్సాహపరిచారు.

పొంగిన గోదావరి..శబరి

గోదావరి, శబరి నీటిమట్టాలు పెరుగుతుండటంతో విలీన మండలాల ప్రజలు వణికిపోతున్నారు. శుక్రవారం ఉదయం తగ్గుముఖం పట్టిన గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో మళ్లీ పెరుగుతుండటంతో ఎటపాక, చింతూరు, వీఆర్‌పురం మండలాల్లోని గ్రామాల్లో వరద నీరు ప్రవేశిస్తోంది. సుమారు 90కు పైగా గ్రామాలు ఇప్పటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్ చింతూరులోనే ఉంటూ వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

- మళ్లీ పెరుగుతున్న నీటిమట్టాలు
- సహాయక చర్యలు ముమ్మరం
- బాధితులకు నిత్యావసరాల పంపిణీ
- వాగులో మునిగి మహిళ మృతి
- జలదిగ్బంధంలో 90కి పైగా గ్రామాలు
- సహాయక చర్యలపై సమీక్షించిన సీఎం



శబరినది ఉధృతికి జలదిగ్బంధంలో చిక్కుకున్న చింతూరు, చట్టి గ్రామాలు (ఏరియాల్ వ్యూ)

చింతూరు: విలీన మండలాల ప్రజలను వరదభయం వీడడం లేదు. గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎటపాక, చింతూరు, వీఆర్‌పురం మండలాల్లో గ్రామాల్లోకి వరదనీరు ప్రవేశిస్తోంది. నాలుగు మండలాల్లో 90కు పైగా గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. వరదనీరు రహదారులపైకి వచ్చేసింది.

పర్యవేక్షిస్తున్న కలెక్టర్

వరద కొంత అధికంగా రావచ్చనే సంకేతాలతో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం చింతూరు చేరుకున్నారు. వరద సహాయక చర్యలను ఆయన పర్యవేక్షిస్తున్నారు. వరద తాకిడికి గురయ్యే గ్రామాల ప్రజలను ముందస్తుగా వాహనాలు, పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న బాధిత కుటుంబాలకు శుక్రవారం కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, క్యాబేజీ పంపిణీ చేశారు. పునరావాస కేంద్రాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

- చింతూరు మండలంలో ఏడు గ్రామాలకు చెందిన 448 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఎంపీపీ సవలం అమల, సర్పంచ్ కారం కన్నారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు ముంపు గ్రామాలను సందర్శించి ప్రభుత్వ సాయం అందేలా చర్యలు చేపడుతున్నారు.
- చింతూరు మండలం కుమ్మూరు గ్రామస్తులు తమ గ్రామాన్ని పోలవరం ముంపులో భాగంగా ప్రాధాన్యత క్రమంలో కలపాలని, పరిహారం ఇవ్వడంతో పాటు పునరావాసం కల్పించాలని కోరుతూ శుక్రవారం వరదనీటిలో జలదీక్ష చేపట్టారు.

ముంపులో జాతీయ రహదారి

ఎటపాక: భద్రాచలం నుంచి నెల్లిపాక వరకు జాతీయ రహదారి వరద ముంపుకు గురైంది. నెల్లిపాక నుంచి కూనవరం వరకు తోటపల్లి, నందిగామ, మురుమూరు ప్రాంతాల్లో ప్రధాన రహదారి నీట మునిగింది.

- ఎటపాక మండలంలో శుక్రవారం సాయంత్రానికి 131 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గన్నవరం, విస్సాపురం, టీపీవీడు పంచాయతీల్లో లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తహసీల్దార్ వేణుగోపాల్ ఏర్పాట్లు చేశారు.
- ముందు జాగ్రత్తగా ఇప్పటికే మురుమూరు,నందిగామ, గౌరిదేవిపేట, గన్నవరం, టీపీవీడు గ్రామాలకు బోటు సౌకర్యం ఏర్పాటు చేశారు. వర్షం తగ్గటంతో గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు వేగవంతం చేసి బ్లీచింగ్ చల్లిస్తున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు

వీఆర్‌పురం: గోదావరి తిరిగి పెరుగుతున్న నేపథ్యంలో వరద అధికమైతే మరిన్ని కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధితులకు కందిపప్పు, కూరగాయలు పంపిణీ చేశారు.

మూడో ప్రమాద హెచ్చరిక జారీతో అప్రమత్తం

గోదావరి వరద గత పదిరోజుల్లో మూడుసార్లు పెరిగింది. శుక్రవారం మూడవ ప్రమాద హెచ్చరిక జారీ అయింది.

- ఈ ఏడాది తొలిసారి 23వ తేదీన మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 44.6 అడుగులు వచ్చిన గోదావరి అనంతరం తగ్గింది.
- రెండోసారి ఈ నెల 26న ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి 50.5 అడుగులు చేరి తగ్గింది.
- శుక్రవారం 53 అడుగులు చేరడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది.

జలదిగ్బంధంలో కూనవరం

కూనవరం: గోదావరి వరద ఉధృతికి మండలకేంద్రం జలదిగ్బంధంలో చిక్కుకుంది.

వరద తిరిగి పెరుతున్న నేపథ్యంలో గ్రామస్తులంతా ఊరిని ఖాళీచేసి కోతులగుట్ట, పైడిగూడెం, భైరవపట్నం పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. వరద బాధితులకు శుక్రవారం కందిపప్పు, కూరగాయలు పంపిణీ చేశారు. కొండాయిగూడెం పాఠశాలలో వర్షపు నీరు చేరడంతో తహసీల్దార్ అనసూయ, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ సందర్శించి నివేదిక పంపారు. బాధితులను ఆదుకునేందుకు లాంచీలు, నాటు పడవలు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని వారు పేర్కొన్నారు.

వాగు దాటుతూ మహిళ మృతి

కూనవరం మండలం దూగుట్టకు చెందిన మడకం వెంకమ్మ(65) అనే వృద్ధురాలు పశువులను మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందింది. వాగులో పడి ఉన్న ఆమె మృతదేహాన్ని గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.



చింతూరు, వీఆర్‌పురం మధ్య రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు



చిన్నమట్టపల్లిలో బాధితులకు కూరగాయలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పిట్టా రామారావు



ఆంధ్రా, తెలంగాణ జాతీయ రహదారి-30పై వరద నీటిలో వాహన రాకపోకలు



గౌరిదేవిపేటలో వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

వరద సహాయక చర్యలపై సీఎం సమీక్ష

బాధితులకు అండగా ఉండాలని ఆదేశం

సాక్షి,పాడేరు: చింతూరు డివిజన్ పరిధిలోని వరదముంపు ప్రభావిత గ్రామాల్లో సహాయక చర్యలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలోని వరదలతో పాటు భద్రాచలం ప్రాంతంలో గోదావరి వరద ఉధృతి, మరోవైపు చింతూరు సమీపంలోని శబరినది పరిస్థితిని సీఎంకు నివేదించారు. పూర్తిస్థాయిలో సహాయక కార్యక్రమాలు చేపట్టాలని, ముంపునకు గురైన బాధిత ప్రజలతో పాటు రవాణా వ్యవస్థ స్తంభించిన గ్రామాలకు ఉచిత నిత్యావసరాలు పంపిణీ వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. వైద్య ఆరోగ్య కార్యక్రమాలతో పాటు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కలెక్టర్‌కు సూచించారు.

వరద బాధితులకు సత్వర సాయం : కలెక్టర్ సుమిత్‌కుమార్

గోదావరి,శబరి నదులలో నెలకొన్న వరద ఉధృతితో ముంపునకు గురైన అన్ని గ్రామాల్లో సత్వర సహాయక కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. విలీన మండలాల్లో 45 వేల మంది జనాభా ఉన్నారని, 10 నుంచి 15 వేల మంది జనాభాకు సంబంధించిన 93 గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయన్నారు. మిగిలిన గ్రామాలకు మాత్రం రవాణా వ్యవస్థ స్తంభించిందని, అయితే బాధిత ప్రజలకు ఉచితంగా నిత్యావసరాల పంపిణీని అధికార యంత్రాంగం చేపడుతుందన్నారు. వరద బాధిత ప్రజలకు అధికార యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. తాను కూడా వరద ముంపు గ్రామాల్లో స్వయంగా పర్యటించి ప్రభుత్వం అందించే ప్రతీసాయాన్ని బాధిత ప్రజలకు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

రెండు మండలాలకు ప్రత్యేకాధికారులు

జిల్లాలోని చింతూరు డివిజన్ పరిధిలో వరద ప్రాంతాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.కూనవరం మండలానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.వెంకటరమణ, వీఆర్‌పురం మండలానికి స్పెషల్ డిప్యూటీ జి.లక్ష్మిపతిని ప్రత్యేకాధికారులుగా నియమించారు.

న్యూస్‌రీల్

బ్యాంక్ లింకేజీ రుణాలతో ఆర్థికాభివృద్ధి

- జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్




బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును పంపిణీ చేస్తున్న జేసీ శివశ్రీనివాస్, పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: గ్రామైక్య సంఘాలలోని డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని జాయింట్ కలెక్టర్ జే.శివశ్రీనివాస్ కోరారు. ముంచంగిపుట్టు మండలానికి చెందిన 115 సంఘాలకు రూ.1.30కోట్లు, హుకుంపేట మండలానికి చెందిన 60 సంఘాలకు రూ.1.28కోట్లు విలువైన బ్యాంక్ లింకేజీ రుణాల నమూనా చెక్కుఉన శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అందజేశారు. జేసీతో పాటు, ఐటీడీఏ పీవో వి.అభిషేక్,అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల బలోపేతం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీడీ మురళీ, ఏపీఎం చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న జోలాపుట్టు నీటిమట్టం

- రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల



జోలాపుట్టు జలాశయం నుంచి విడుదల అవుతున్న నీరు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన జోలాపుట్టు జలాశయ నీటిమట్టం పెరుగుతోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు రెండు పవర్ స్లూయిజ్ గేట్లు ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువనున్న డుడుమ జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2750 అడుగులు కాగా శుక్రవారం ఉదయానికి 2704 అడుగులకు చేరింది.గత ఏడాది ఇదే రోజుకు 2697 అడుగుల నీటి మట్టం ఉండేది. గత ఏడాదితో పోలిస్తే ఏడు అడుగుల నీటి మట్టం అధికంగా ఉంది. దిగువనున్న డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2590 అడుగులు కాగా ప్రస్తుతం 2581.20 అడుగుల నీటి మట్టం ఉంది. సరిహద్దులో గత కొన్ని రోజులుగా విస్తరంగా కురుస్తున్న వర్షాలతో జలాశయ అధికారులు ప్రాజెక్టు ఉన్నత అధికారుల ఆదేశాలతో నిరంతరం నీటి మట్టం అంచనా వేస్తూ పర్యవేక్షిస్తున్నారు.

ఎముకల వైద్య నిపుణుడు బాధ్యతల స్వీకరణ



డాక్టర్ ఈ.సాయికృష్ణ

చింతపల్లి రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఎముకల వైద్య నిపుణుడు డాక్టర్ ఈ.సాయికృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఎముకల వైద్య నిపుణులు పోస్టును ప్రభుత్వం భర్తీ చేసింది.

మొండి బకాయిల వసూలుపై దృష్టి



మాట్లాడుతున్న ఆర్‌బీఎం (ఎడమవైపు) మోహన్‌రావు

కొయ్యూరు: మొండి బకాయిల వసూలుపై దృష్టి సారించాలని అనకాపల్లి ఏపీజీవీబీ ప్రాంతీయ బిజినెస్ మేనేజర్ (ఆర్‌బీఎం)మోహన్‌రావు సూచించారు.శుక్రవారం ఆయన కొయ్యూరు ఏపీజీవీ బ్యాంకును సందర్శించారు. ఇక్కడ బీఎం సతీష్‌కుమార్‌తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీమాపై అందరికి అవగాహన కల్పించాలన్నారు.ప్రతీ ఒక్క ఖాతాదారునితో బీమా చేయించాలని సూచించారు. ప్రతీ ఒక్కరికి బ్యాంకు ఖాతా కలిగి ఉండేలా చూడాలన్నారు.డీవోడీఆర్‌సీ ఆడిట్ విభాగానికి చెందినవేణుగోపాల్ పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో కంటికి రెప్పలా..



చింతూరు మండలం కుయిగూరులో బాధిత కుటుంబానికి బాసటగా నిలిచిన వలంటీరు



చింతూరు మండలంలో మల్లెతోటలో వరదపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వలంటీరు

- మన్ననలు పొందుతున్న వలంటీర్లు

చింతూరు : వరద ప్రభావిత ప్రాంతాల్లో గ్రామ వలంటీర్లు విశేష సేవలందిస్తున్నారు. వరదలపై ముంపు ప్రభావిత గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వరద ముంపుకు గురైన రహదారుల వద్ద కాపలాగా ఉంటూ ప్రజలు ప్రమాదకర వాగులు దాటకుండా నిలువరిస్తున్నారు.

- అత్యవసర సేవలు అవసరమైన వారి సమాచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారిని లాంచీలు, పడవల ద్వారా వరద దాటిస్తున్నారు. వరద నీరు గ్రామాల్లోకి చేరుతున్న వేళ ప్రజలను అప్రమత్తం చేసి ఇళ్లను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలు, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.
- పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వరద బాధితులకు సాయంగా ఉంటూ వారికి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న నిత్యావసరాలు, కూరగాయలను అందిస్తున్నారు. పునరావాస కేంద్రాలు, సురక్షిత ప్రాంతాల్లోని బాధితుల వివరాలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్తూ అండగా ఉంటున్నారు.
- వరద తాకిడికి ఏయే గ్రామాలు ముంపుకు గురయ్యాయి, ఎంతమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు, ఎంతమందికి సాయం అందించాలనే వివరాలను అధికారులకు సమాచారం ఇస్తున్నారు.

అందుబాటులో నిత్యావసరాలు : ఐటీడీఏ పీవో

చింతూరు: వరద బాధితులకు సహాయక చర్యల్లో భాగంగా నిత్యావసరాలతో పాటు ఇతర సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే జీసీసీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జీసీసీ గోడౌనును పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ముంపు ప్రభావిత గ్రామాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. చింతూరు మండలానికి 155 మెట్రిక్ టన్నుల బియ్యం, 500 కేజీల కందిపప్పు, కూనవరానికి 139 మెట్రిక్ టన్నుల బియ్యం, 5,400 కేజీల కందిపప్పు, ఎటపాక మండలానికి 110 మెట్రిక్ టన్నుల బియ్యం, 1,000 కేజీల కందిపప్పు, వీఆర్‌పురం మండలానికి 152 మెట్రిక్ టన్నుల బియ్యం, 5,000 కేజీల కందిపప్పు పంపించినట్లు ఆయన తెలిపారు.

వారంలో మూడు రోజులే..

- జలపాతాల సందర్శనకు అనుమతి

మారేడుమిల్లి : మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన అమృతధార, జలతరంగిణి జలపాతాలకు వారంలో శుక్ర, శని, ఆదివారాల్లో మాత్రమే సందర్శనకు అనుమతి ఇస్తున్నట్లు మారేడుమిల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి కరుణాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల పర్యాటక ప్రదేశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంతో ఆశతో ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు నిరాశకు గురికాకుండా ఉండేలా మూడు రోజులు మాత్రమే అనుమతి ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు



పూతికపుట్టు సమీపంలో వర్షాలకు కొట్టుకుపోయిన గ్రావెల్ రోడ్డు

అనంతగిరి: మండలంలోని పినకోట, పెదకోట, కివర్ల మూడు పంచాయతీల పరిధిలోని చల్లగెడ్డ నుంచి బొర్రాపాలెం, చట్టకంబ, కివర్ల జగడమామిడి, తంగేలబంద, పుతికపుట్టు, గంగవరం గ్రామాలను కలిపే గ్రావెల్ రోడ్డు కోతకు గురైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. అధికారులు స్పందించి పక్కారోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విధులకు డుమ్మా కొట్టిన హెచ్‌ఎం



స్టోర్ రూంలో చంద్రబాబు ఫొటోతో ఉన్న సంచి గురించి ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ



కాలం చెల్లిన పెరుగు డబ్బాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

- కంతబౌంసుగడ బాలికల ఆశ్రమం తనిఖీలో గుర్తించిన ఎమ్మెల్యే పాల్గుణ
- స్టాక్ రూంలో కాలం చెల్లిన పెరుగు
- అధ్వానంగా స్టాక్ రిజిస్టర్ నిర్వహణ
- పాడేరు ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరిక

అరకులోయ టౌన్: కంతబౌంసుగడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తనిఖీ చేశారు. అధికారుల అనుమతి లేకుండా, పాత సెలవు చీటిని దిద్దుబాటు చేసి హాజరు రిజిస్టర్‌లో ఉండటాన్ని ఎమ్మెల్యే గమనించారు. కొన్నిరోజులుగా హాజరుపట్టీలో హెచ్‌ఎం సంతకాలు లేకపోవడంతో పాడేరు డీడీకి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. హెచ్‌ఎం రాజ్యలక్ష్మి సెలవుకు సంబంధించి ఎటువంటి అనుమతి పొందలేదని డీడీ తెలపడంతో ఆమె విధులకు డుమ్మా కొట్టినట్టు గుర్తించారు. విద్యార్థులతో సైన్స్ పాఠం, ఎక్కాలు చదివించారు. విద్యార్థులు తడబడటంతో వీరిని ఎందుకు తీర్చిదిద్దడం లేదని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. బ్యాగ్‌లు, బూట్లు, తదితర వస్తువులు ఎవరిస్తున్నారని విద్యార్థులను అడుగగా, జగన్ మామయ్య అని విద్యార్థులు బదులిచ్చారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు దుర్వాసన వెదజల్లుతుండటంతో ఫినాయిల్‌తో ప్రతీ రోజు శుభ్రం చేయాలని ఆదేశించారు. వసతిగృహంలోని స్టోర్‌ను పరిశీలించారు. గుడ్లు, బియ్యం నిల్వలు రికార్డుల్లో కంటే ఎక్కువగా ఉన్నాయి. కాలం చెల్లిన 40 లీటర్ల పెరుగును గుర్తించారు.స్టాక్ రిజిస్టర్ నిర్వహించకపోవడంపై ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. స్టోర్ రూంలో చంద్రబాబు ఫొటోతో ఉన్న సంచి ఉండటంపై ఆరా తీశారు.పాఠశాలలో బోర్డుపై రాష్ట్రపతి, గవర్నర్, ప్రజాప్రతినిధుల పేర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాల, వసతి గృహంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఫొటోను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్చార్జి ఏటీడబ్ల్యూవో వైకుంఠరావు, ఎంఈవో భారతీరత్నం, ఎంపీటీసీ భీమరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో రాజారమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు



బూదరాళ్ల రహదారిలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐ లోకేష్‌కుమార్



ముంచంగిపుట్టులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రవీంద్ర,పోలీసులు

సీలేరు : స్థానిక పోలీసుస్టేషన్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ రామకృష్ణ, సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను ఆరా తీస్తున్నారు. సరిహద్దు దాటుతున్న వాహనాలను తనిఖీ చేసి విడిచిపెడుతున్నారు. జెన్‌కో, ప్రభుత్వ ఆస్తులకు భద్రత కల్పించారు.రాత్రిపూట బస్సు సరీ్వసులను నిలిపివేశారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద గస్తీ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శుక్రవారం ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.మారుమూల బుంగాపుట్టు, భూసిపుట్టు,రంగబయలు పంచాయితీల నుంచి వచ్చే వాహనదారులను ప్రశ్నించి వారి లగేజీలు, బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలు సేకరించి విడిచిపెట్టారు. జోలాపుట్టు, దోడిపుట్టు నైట్‌హాల్ట్ బస్సులను మండల కేంద్రానికే పరిమితం చేశారు. ప్రభుత్వ కార్యలయాల వద్ద రాత్రిపూట పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు.

చింతపల్లి రూరల్: మావోయిస్టుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా భద్రత బలగాలను కట్టుదిట్టం చేశామని ఎస్‌ఐ రమణ తెలిపారు. శుక్రవారం మండలంలో లోతుగడ్డ బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు.

వై.రామవరం: వై.రామవరం – అడ్డతీగల ప్రధాన రహదారిలో శుక్రవారం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి విడిచిపెట్టారు. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులపై గట్టి నిఘా విధించారు. అడిషనల్ ఎస్‌ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.

కొయ్యూరు: కొయ్యూరు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్, స్పెషల్ పార్టీ పోలీసులు బూదరాళ్ల రహదారిలో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు.

క్లుప్తంగా

ప్రాంతీయ సమన్వయకర్త సుబ్బారెడ్డికి అభినందనలు



వై.వి.సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలుపుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్రతో పాటు, అరకు పార్లమెంట్ నియోజకవర్గానికి ప్రాంతీయ సమన్వయకర్తగా నియమితులైన టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డిని, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరసింగరావు దంపతులు శుక్రవారం విజయవాడలో కలిశారు.ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయ అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లాలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసే కార్యక్రమాలపై చర్చించినట్టు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు.

2,263 ధ్రువపత్రాల పంపిణీ

సాక్షి,పాడేరు: జిల్లాలోని రంపచోడవరం మండలంలోని రెండు సచివాలయాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వలంటీర్లు 2,320 గృహాలను సందర్శించి వివిధ ధ్రువపత్రాల నిమిత్తం 2,561 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారని ఆయన వివరించారు. వీటిలో 2,263 ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు. ఒక్క దరఖాస్తు మాత్రం తిరస్కరణకు గురైందన్నారు. మిగిలిన ధ్రువపత్రాలను రెండు రోజుల్లోగా పంపిణీ పూర్తి చేస్తామన్నారు.

నేడు రెండు చోట్ల జగనన్న సురక్ష శిబిరాలు

జగనన్న సురక్ష పథకం శిబిరాలను శనివారం హుకుంపేట మండలంలోని హుకుంపేట, తీగలవలస సచివాలయాల్లో నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.

నైపుణ్యాభివృద్ధిలో హెచ్‌ఆర్ కీలకం

- సీఐఐ ఏపీ వైస్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

సాక్షి, విశాఖపట్నం: ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధిలో హెచ్‌ఆర్ నిపుణుల పాత్ర కీలకమని సీఐఐ ఏపీ వైస్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో హెచ్‌ఆర్ కాంక్లేవ్ పేరిట సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కోవిడ్ అనంతరం ఏడాది తర్వాత ఐటీ సంస్థల మానవ వనరుల నిపుణులు తమ ఉద్యోగులను తిరిగి ఆఫీసులకు రప్పిస్తున్నారన్నారు. వారిలో నైపుణ్యాభివృద్ధి, వైవిధ్యం, భద్రతలకు వీలుగా హెచ్ ఆర్ నిపుణులు కృషి చేస్తున్నారని చెప్పారు. సీఐఐ పూర్వ చైర్మన్ డి.రామకృష్ణ మాట్లాడుతూ వివిధ కంపెనీలు వేగంగా మార్పులను ఎదుర్కొంటున్నందున వాటి నిర్వాహకులు సంస్థల అభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని చెప్పారు. ఇందులో మార్పు, సంస్కృతి విజయానికి కీలకమన్నారు. ప్యారడైజ్ ఫుడ్‌కోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, సీఈవో గౌతమ్ గుప్తా మాట్లాడుతూ పని సంస్కృతి చాలా ముఖ్యమని, కాలానుగుణంగా సందర్భానుసారం ఉద్యోగులను ప్రసంశించడం, వారిని గుర్తించడం మంచి ఫలితాలనిస్తుందన్నారు. సీఐఐ విశాఖ హెచ్‌ఆర్ ప్యానెల్ కన్వీనర్, వైస్ ప్రెసిడెంట్ పీఎస్ ఠాగూర్ మాట్లాడుతూ సానుకూల దృక్పథం మంచి ఫలితాలను, సత్సంబంధాలను పెంపొందిస్తుదన్నారు.

వ్యాపార ప్రక్రియల్లో సాంకేతికతను వినియోగించుకోవడం చాలా ముఖ్యమన్నారు. హైదరాబాద్ టీసీఎస్ హెచ్‌ఆర్ హెడ్ శ్రీకాంత్ సూరంపూడి మాట్లాడుతూ తమ హెచ్‌ఆర్ టెక్నాలజీని ఎలా డిజైన్ చేయాలి, ఎలా ఉపయోగించాలి అనే అంశాల్లో ప్రజలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. వ్యాపార విజయానికి ఉద్యోగి అనుభవం కీలకమని ఆయా సంస్థలు తెలుసుకుంటున్నాయన్నారు. సదస్సులో పీపుల్ అండ్ కల్చర్ హెడ్ సాలినీ నాయర్, అమేడియస్ సాఫ్ట్‌వేర్ ల్యాబ్స్ ఇండియా ప్రతినిధి అజిత్‌నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు



మంత్రి అమర్‌నాథ్‌కు ఏర్పాట్ల గురించి వివరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): జీవీఎంసీ 45వ వార్డు పోర్టు ఆస్పత్రి సమీపంలో రహేజా గ్రూప్ సుమారు రూ.600 కోట్లతో నిర్మించనున్న ఇనార్బిట్ మాల్‌కు వచ్చే నెల 1న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం శంకుస్థాపన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోర్టుకు చెందిన సుమారు 17 ఎకరాల్లో నిర్మించనున్న ఈ మాల్ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అతి పెద్దదిగా నిలువనుందని తెలిపారు. సుమారు 280కు పైగా కంపెనీలకు చెందిన ఔట్‌లెట్స్ ఈ మాల్‌లో ఉంటాయన్నారు. ఇందుకు అవసరమైన అనుమతులను ప్రభుత్వం నుంచి రహేజా గ్రూప్ యాజమాన్యం ఇప్పటికే తీసుకుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. 24 నెలల్లో ఈ మాల్ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. విస్తరణలో భాగంగా భవిష్యత్తులో ఇదే ఆవరణలో ఒక ఐటీ టవర్‌ను కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి రహేజా గ్రూప్‌ను కోరారని, అందుకు వారు అంగీకరించారని మంత్రి తెలిపారు. విశాఖను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న ధృడసంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. అలాగే అదే రోజున జీవీఎంసీకి చెందిన సుమారు రూ.138 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ కంపా హనోకు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు అభినందనల వెల్లువ

సాక్షి,పాడేరు: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా శుక్రవారం డాక్టర్ డీవీజీ శంకరరావు విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమానికి పాడేరు, అరకులోయ నియోజకవర్గాల నుంచి భారీగానే నేతలు తరలివెళ్లారు. మాజీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, రాష్ట్ర జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ శోమేశ్వరి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి, జంపరంగి లిల్లిలతో పాటు విద్యార్థి విభాగం నేత తెడబారికి సురేష్‌కుమార్, పార్టీ ఎస్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా కోలా గురువులు ప్రమాణ స్వీకారం నేడు



కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా కోలా గురువులు శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు డీసీసీబీ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ చైర్మన్, విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, నగర మేయర్ హరివెంకట కుమారి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షులు, ఎంపీపీలు హాజరుకానున్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

- ముఖ్యమంత్రికి కాంట్రాక్టు అధ్యాపకుల కృతజ్ఞతలు
- కళాశాల భవనాల మరమ్మతు కోసం అధికారులకు ఆదేశం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, అరకు ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శుక్రవారం సందర్శించారు.రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వ హామీతో కాంట్రాక్టు అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే కళాశాలలో గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలేజీలో భవన సమస్యను ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ ఎమ్మెల్యేకు తెలియజేశారు. భవనం పెచ్చులూడిపోతున్నాయని, సిబ్బంది, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే పాల్గుణ స్పందించి టీబ్ల్యూ ఈఈ వేణుగోపాల్‌తో ఫోన్‌లో మాట్లాడి కళాశాల భవనం మరమ్మతుకు నివేదిక తయారు చేయాలని సూచించారు. దీనిపై భవన మరమ్మతుకు నివేదిక తయారు చేశామని, రూ.1.20కోట్లు అవుతందని ఈఈ తెలిపారు. ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ భవనం మరమ్మతుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అరకులోయలో పీజీ సెంటర్ మంజూరైందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, విద్యార్థులు ఉన్నత విద్యను ఇక్కడే అభ్యసించవచ్చన్నారు. కళాశాలలో నోటీసుబోర్డు ఏర్పాటు చేసి, రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, కలెక్టర్, ఐటీడీఏ పీఓ, సబ్ కలెక్టర్, తదితరుల పేర్లు రాయించాలని, అందుకు అయ్యే ఖర్చు తాను భరిస్తానని ఎమ్మెల్యే ప్రిన్సిపాల్‌కు తెలిపారు. ఇన్‌చార్జి ఏటీడబ్ల్యూవో వైకుంఠరావు, ఎంఈవో భారతీరత్నం, హెచ్‌డబ్ల్యూవో రాజేంద్ర, జీసీసీ మేనేజర్ వెంకటేష్, బీసీ సెల్ అధ్యక్షుడు నర్సింగరావు, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, కాంట్రాక్ట్ అధ్యాపకులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 76 వినతుల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వ్యక్తిగత,గ్రామాల సమస్యలపై 76వినతులను స్వీకరించారు.ఐటీడీఏ పీవో వి.అభిషేక్,అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవలు కూడా గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, పాడేరు,అరకు ఈఈలు డీవీఆర్ఎం రాజు, వేణుగోపాల్,ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్, కాఫీ ఏడీ అశోక్ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- కొయ్యూరు మండలం చిట్టంపాడు హైస్కూల్‌కు వెళ్లే దారిలో సీసీరోడ్డు లేక ప్రజలు,విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తుడు టి.రమణ అధికారులను కోరాడు.
- డుంబ్రిగుడ మండలం తూటంగి పంచాయతీ బొడ్డాపుట్టు గ్రామానికి సీసీ రోడ్డు, మురుగు కాల్వలు నిర్మించాలని సర్పంచ్ కమల వినతి పత్రం అందజేశారు.
- ముంచంగిపుట్టు మండలంలోని జర్జుల పంచాయతీలోని పలు గ్రామాల్లో 2018 నుంచి 2020 వరకు నిర్మించిన గృహనిర్మాణాలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్పంచ్ డి.పార్తిమా వినతి పత్రం అందజేశారు.
- పాడేరు మండలం కాడెలి పంచాయతీ వర్తనాపల్లి కాలనీ గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పించాలని అదే ప్రాంతానికి చెందిన ఎస్.కీర్తి అర్జీ అందజేశారు.
- డుంబ్రిగుడ మండలం గుంటసీమ పంచాయతీ తడ్డ నుంచి తూటంగికి,తూటంగి నుంచి నేరేడువలస గ్రామాలకు తారురోడ్లు నిర్మించాలని వినతి పత్రం అందజేశారు.
- అరకులోయ మండలం బొండాం పంచాయతీ పరిధిలోని నిన్నిమామిడి,రంగినివలస గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, సర్పంచ్ దురియా భాస్కరరావు వినతి పత్రం అందజేశారు.

వేర్వేరు చోట్ల 550 కిలోల గంజాయి పట్టివేత



పెదబయలులో గంజాయి, నిందితులతో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది



కొత్తపుట్టులో పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్ఐ, సిబ్బంది

- రెండు జీపులు, ఒక బైక్ సీజ్
- ముగ్గురు నిందితుల అరెస్ట్.. నలుగురు పరారీ

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ సీతగుంట జంక్షన్‌లో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా జీపులో ఒడిశాకు తరలిస్తున్న 450 కిలోల గంజాయి పట్టుబడినట్టు పెదబయలు ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సీతగుంట జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా మారుమూల జామిగుడ ప్రాంతం నుంచి జీపులో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, అందులో ఉన్న ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు తప్పించుకుని పారిపోయారని తెలిపారు. ఈ జీపునకు ముందు పైలట్‌గా ఒక పల్సర్ బైక్‌లో వచ్చిన వ్యక్తి పోలీసులను చూసి బైక్ వదిలేసి పరారయ్యాడని తెలిపారు. జీపు, బైక్ సీజ్ చేశామని, గంజాయి తరలిస్తున్న రూడకోట పంచాయతీ బడంబీరు గ్రామానికి చెందిన కోడ పోతన్నను అదుపులో తీసుకుని రిమాండ్‌కు తరలించామని, ఇద్దరు నిందితులు పరారయ్యారని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.6.75 లక్షలు ఉంటుందని తెలిపారు. అడుగులపుట్టు కొత్తాపుట్టు జంక్షన్‌లో ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేయగా ముంచంగిపుట్టు మండలం కుమడ వైపు నుంచి ఒడిశాకు జీపులో తరలిస్తున్న 100 కిలోల గంజాయిని పట్టుకున్నామని, జీపులో ఉన్న జి.మాడుగుల మండలం కోరాపల్లి పంచాయతీ మగబురుగు గ్రామానికి చెందిన పాంగి కృష్ణారావు, పెదబయలు మండలం కోనాపుట్టు గ్రామానికి బసుదొర ప్రసాద్‌లను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, పరారైన ఇద్దరు నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీవో శ్రీనివాస్

రంపచోడవరం: జాబ్‌మేళా ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏపీవో శ్రీనివాసరావు అన్నారు. రంపచోడవరం డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. జాబ్‌మేళాలో పది కంపెనీలు పాల్గొన్నాయి. జాబ్‌మేళాకు హాజరైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 118 మంది జాబ్‌మేళాకు హాజరు కాగా 35 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ తెలిపారు. ఏఓ డీఎస్‌వీ రమణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జె.పద్మాకర్‌బాబు, సంగీత పాల్గొన్నారు.

నేడు ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన

చింతూరు: చింతూరు డివిజన్‌లో వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ శనివారం పర్యటించనున్నారు. ముందుగా వారు చింతూరులో పునరావాస కేంద్రాలను సందర్శించి వరద బాధితులతో మాట్లాడుతారు. అనంతరం కూనవరం మండలంలో చినార్కూరు, సున్నంవారిగుంపు, కోతులగుట్ట, పైడిగూడెం పునరావాస కేంద్రాలను సందర్శిస్తారు. వీఆర్ పురం మండలంలో ధర్మతాళ్లగూడెం, రేఖపల్లి, వడ్డిగూడెం, శ్రీరామగిరి గ్రామాలను సందర్శించి వరద బాధితులతో మాట్లాడతారు.

10న సీజ్ బియ్యం వేలంపాట

సాక్షి, పాడేరు: ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ జిల్లాలో పలుచోట్ల పట్టుబడిన బియ్యాన్ని ఈనెల 10న బహిరంగ వేలం వేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు, రాజవొమ్మంగి, జి.మాడుగుల, అడ్డతీగల, పెదబయలు, కొయ్యూరు మండలాల్లో పట్టుబడిన బియ్యాన్ని జీసీసీ గిడ్డంగుల్లో భద్రపరిచామని ఆయన తెలిపారు. పాడేరు డివిజన్‌లో 19 టన్నులు, చింతూరు డివిజన్‌లో 44టన్నులు, రంపచోడవరం డివిజన్‌లో 50టన్నులు ఉన్నాయన్నారు. ఈ బియ్యంను వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వ్యాపారులు కలెక్టర్ సీఎస్, అల్లూరి సీతారామరాజుజిల్లా పేరిట, పాడేరు ఎస్‌బీఐలో చెల్లుబాటు అయ్యే విధంగా రూ.20వేలు డీడీ తీయాల్సి ఉంటుందని, దరఖాస్తు ఫారం కోసం రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పాడేరు కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సరఫరాలశాఖ కార్యాలయంలోని అధికారులను సంప్రదించాలన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వ్యాపారికి లేదా మిల్లర్‌కు తప్పనిసరిగా జీఎస్టీ ఉండాలన్నారు. ఆయా మండల కేంద్రాల్లోని గిడ్డంగుల్లో భద్రపరిచిన బియ్యంను వ్యాపారులు ఆగస్టు 9వతేదీ వరకు పరిశీలన చేసుకోవచ్చని జేసీ సూచించారు.

గోవా టు శ్రీకాకుళం

- విశాఖ మీదుగా మద్యం తరలిస్తున్న ముఠాకు చెక్
- రైల్వేస్టేషన్‌లో అక్రమ మద్యం పట్టివేత
- ముగ్గురిని అరెస్ట్.. 295 బాటిళ్లు స్వాధీనం

దొండపర్తి: గోవా టు శ్రీకాకుళం వయా విశాఖపట్నం.. ఇది కొత్తగా స్టార్ట్ చేసిన బస్ సర్వీస్ కాదు.. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అసలే కాదు.. అక్రమంగా రాష్ట్రాన్ని మద్యాన్ని తీసుకువచ్చేందుకు స్మగ్లర్లు ఎంచుకున్న రూటు. గోవా మద్యాన్ని దర్జాగా రాష్ట్రాలు దాటించిన ముఠాకు విశాఖలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు చెక్ పెట్టారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ.. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను మహారాణిపేట సెబ్ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 295 గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లాకు చెందిన పొదిలాపు సత్యనారాయణ గోవాలో మద్యం షాపు నుంచి రూ.26కు కొనుగోలు చేసి ఇక్కడి తీసుకువచ్చి తన సహచరుడైన విజయనగరం జిల్లాకు చెందిన ధనుంజయకు బాటిల్ రూ.92కు విక్రయిస్తుంటాడు. దాన్ని ధనుంజయ శ్రీకాకుళం జిల్లాకు చెందిన గొర్లె లక్ష్మీనాయుడుకు రూ.100 అమ్ముతుంటాడు. లక్ష్మీనాయుడు తన గ్రామంలో ఒక్కో బాటిల్ రూ.120కు విక్రయిస్తుంటాడు. ఇలా అక్రమ మార్గంలో మద్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఈ ముఠాకు విశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు ఆధ్వర్యంలో అడ్డుకట్ట వేశారు. ఎప్పటిలాగే సత్యనారాయణ గోవాలో మద్యాన్ని కొనుగోలు చేసి అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలులో విశాఖకు తీసుకువచ్చాడు. విశాఖ రైల్వేస్టేషన్‌లో వీరు సరుకు మార్చుకుంటుండగా మహారాణిపేట సెబ్ సీఐ జగదీశ్వరరావు బృందం దాడులు చేసిన వారి పట్టుకుంది. వారిని అదుపులో తీసుకుని వారి నుంచి 295 గోవా మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు విశాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు, జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉంటే మహారాణిపేట స్టేషన్ పరిధిలోని దాడుల్లో పట్టుబడిన మద్యాన్ని అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. దాడుల్లో సీజ్ చేసిన నాలుగు వాహనాలకు వేలం నిర్వహించారు.

విద్యుత్ సమస్యపై ఫిర్యాదు చెయ్యండి

- వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు
- 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు అదనంగా పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు
- ప్రజలకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ ఉపకరణాలు, కనెక్షన్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్ ఇమ్మడి సూచించారు. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలను పర్యవేక్షించడానికి జిల్లా కేంద్రాలలో ఉన్న సూపరింటెండెంట్ ఇంజనీర్ల కార్యాలయాలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/టెక్నికల్ నియంత్రణలో ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 1912కు అదనంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు. తుపాను లేదా భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలకు సంబంధించిన మరమ్మతు పనులు పూర్తయ్యేంత వరకూ 24/7 ఈ పర్యవేక్షణ కేంద్రాలు పనిచేస్తాయని సీఎండీ పృథ్వితేజ్ స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, ఇతర సరఫరా సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు వివిధ సర్కిళ్ల పరిధిలో ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని విద్యుత్ వినియోగదారులకు సీఎండీ సూచించారు.

- సూపరింటెండెంట్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, ఏలూరు - 9440812702
- సూపరింటెండెంట్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, రాజమహేంద్రవరం - 9440812583
- సూపరింటెండెంట్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, విశాఖపట్నం - 9440812487
- సూపరింటెండెంట్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, విజయనగరం- 9440812447
- సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్, శ్రీకాకుళం - 9440812386

మత్స్యగెడ్డలో వ్యక్తి గల్లంతు: మృతదేహం లభ్యం

పెదబయలు: గలగండ గ్రామానికి చెందిన కుర్తాడి గణపతి(36) మృతదేహం బంగబంద గ్రామ సమీపంలో లభ్యమైనట్టు సర్పంచ్ పూజారి లోయితాస్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. బంధువుల వివరాల ప్రకారం ఈ నెల 25న వ్యవసాయ పనుల కోసం వెళ్లిన గణపతి ఇంటికి తిరిగి రాలేదని, ఆయన ఆచూకీ కోసం ప్రయత్నాలు చేశామని మృతుడి భార్య పద్మ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం గలగండ పంచాయతీ మంగబంద సమీపంలోని మత్స్యగెడ్డలో శవం ఉన్నట్టు తెలుసుకొని వెళ్లి పరిశీలించగా తన భర్త గణపతిగా గుర్తించినట్టు పేర్కొన్నారు. వ్యవసాయ పనికి వెళ్లిన గణపతి, మృతదేహంగా మత్స్యగెడ్డలో దర్శనమివ్వడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. ఈ సంఘటనపై పోలీసు స్టేషన్‌లో బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ

పాడేరు రూరల్: జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, ఐసిటీసీ కేంద్రాల్లో హెచ్ఐవీ,ఎయిడ్స్ టెస్టులను వ్యాధి లక్షణాలు గల వ్యక్తికి నిర్ధారణ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేసి నిర్దిష్టమైన ఐడీలు క్రియేట్ చేయాలని జిల్లా క్షయ ఎయిడ్స్ లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు అన్నారు. పాడేరు ఐటీడీఏలో శుక్రవారం ఐసీటీసి సిబ్బంది పీహెచ్‌సీల ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ అయిన తరువాత వైద్యం సకాలంలో అందించాలని సూచించారు. డాక్టర్ కామేశ్వర ప్రసాద్, కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, సుకుమార్, శైలజ, సంజీవపాత్రుడు, ల్యాబ్ టెక్నీషియన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.